ప్రకాశం జిల్లా తేది:23.08.2025

**విద్యార్థుల భద్రత, శ్రేయస్సుకు కళాశాల యాజమాన్యాలు కృషి చేయాలి: ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏ.ఆర్ దామోదర్ ఐపియస్ గారు**

**విద్యార్థుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ గారు**

విద్యార్థుల సంక్షేమం, భద్రత,ర్యాగింగ్ కార్యకలాపాలు, గంజాయి మరియు మాదకద్రవ్యాలు వాడకంపై కట్టుదిట్ట చర్యలు తీసుకోవడంపై దృష్టిసారిస్తూ, విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, సవాళ్లపై అవగాహన కల్పించడం, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఒంగోలు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలు, హాస్టల్ వార్డన్స్ మరియు విద్యార్థులతో జిల్లా ఎస్పీ గారు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆత్మహత్యలు, ర్యాగింగ్, వేధింపులు, సైబర్ నేరాలు, క్యాంపస్‌లో జరిగే అల్లర్లు, మరియు కుల/మత రాజకీయాల ప్రభావం వంటి సమస్యలపై చర్చ జరిగింది.

ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ, కళాశాల యాజమాన్యాలు కేవలం విద్యా బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థుల మానసిక, శారీరక క్షేమంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేందుకు దారితీసే ఒత్తిడి, అకాడమిక్ భారం, మరియు వ్యక్తిగత సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించేందుకు కౌన్సిలింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, మరియు వేధింపులు సమాజంలో తీవ్రమైన నేరాలని స్పష్టం చేశారు. ఈ నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కళాశాల యాజమాన్యాలు ఎలాంటి జాప్యం లేకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కళాశాలల్లో మహిళా భద్రతకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వాటి పనితీరును సమీక్షించాలని కోరారు. ఫిర్యాదులకు సంబంధించిన కంప్లైంట్ బాక్స్ ను ఏర్పాటు చేయాలని, సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చట్టాలు మరియు శిక్షలు గురించి తెలియచేసారు.

హాస్టళ్లలో విద్యార్థుల భద్రతను పర్యవేక్షించడం చాలా ముఖ్యమన్నారు. హాస్టల్ మెస్, ఆహార నాణ్యత సమస్యలు విద్యార్థుల్లో అసంతృప్తిని పెంచుతాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.హాస్టల్ వార్డెన్లు, మెస్ నిర్వాహకులు నిరంతరం విద్యార్థులతో సంప్రదింపులు జరిపి, వారి అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. హాస్టళ్లలో రిజిస్టర్ ను నిర్వహించాలని, మాదకద్రవ్యాలు జోలికి వెళ్ళకుండా విధ్యార్థులను చైతన్య పరచాలన్నారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో వచ్చే మోసాలు, బెదిరింపుల పట్ల జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాలపై, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలని,కళాశాల ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.

మాదకద్రవ్యాల వినియోగం, సిగరెట్లు, మరియు ఇతర మత్తుపదార్థాలకు దూరంగా ఉండేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని, క్యాంపస్‌లో మాదకద్రవ్యాల విక్రయాలను నిరోధించడానికి పోలీస్ సహకారం తీసుకోవాలని సూచించారు.

విద్యార్థుల మధ్య వైరం, సామాజిక వర్గాలు, కుల రాజకీయాలు, మరియు ప్రాంతీయ విభేదాలు క్యాంపస్‌లో అశాంతికి దారితీస్తాయని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, వీటిని నివారించడానికి కళాశాల యాజమాన్యాలు సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సమావేశంలో చర్చించిన అంశాలు విద్యార్థుల భద్రత మరియు శ్రేయస్సుకు చాలా ముఖ్యమైనవని ఎస్పీ గారు అన్నారు. విద్యార్థులు భద్రంగా మరియు సౌకర్యవంతంగా తమ విద్యా జీవితాన్ని కొనసాగించేందుకు కళాశాల యాజమాన్యాలు మరియు పోలీస్ శాఖ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఇలాంటి సమావేశాలు తరచుగా నిర్వహిస్తామని ఎస్పీ గారు నిర్ణయించారు.

విద్యార్థులు చదువుల్లో క్రమశిక్షణ ఎంతో అవసరమని, క్రమశిక్షణ లేకపోతే బంగారు భవిష్యత్తుకు బాటలు ఉండవని, విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకొని భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. కళాశాలలో ఏమైనా అనుకోని సంఘటనలు జరిగినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112/100 కు తెలియజేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్.శ్రీనివాసరావు,ఎస్బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ దేవ ప్రభాకర్, ఒంగోలు తాలూకా సీఐ విజయకృష్ణ, ఒంగోలు రూరల్ సీఐ యన్. శ్రీకాంత్ బాబు,సింగరాయకొండ సీఐ హజరత్తయ్య, ఎస్సైలు, *IIIT SN* పాడు, పేస్, రైజ్, క్విజ్, మలినేని, *SGIT* మార్కాపురం, *KITS* మార్కాపురం, *AI* గ్లోబల్, ఇందిరా ఇంజినీరింగ్ కాలేజీ మరియు పలు ఇంజినీరింగ్ కాలేజీలు యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్, అడ్మినిస్ట్రేషన్ విభాగం, హాస్టల్ వార్డన్స్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.











